సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



కిలో టమాట రూ.24

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.24, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.15 ప్రకారం ధర పలికింది.



నియంత్రణలో హెచ్ఐవీ

జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు వైద్య సిబ్బంది పటిష్ట చర్యలు తీసుకున్నారు. వైరస్ వ్యాప్తిని అరికట్టారు.

IIలో

గరిష్టం/కనిష్టం
33.1°/ 19.3°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉదయం పూట చలి తీవ్రత పెరిగింది. గంటకు 4 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

'జగనన్నకు చెబుదాం' రద్దు

పుట్టపర్తి అర్బన్: అనివార్య కారణాలతో శుక్రవారం పెనుకొండలో నిర్వహించనున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు.

నృసింహుని హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం ఆలయ అధికారులు, బ్యాంక్ అధికారులు లెక్కించినట్లు ఆలయ చైర్మన్ గోపాలక్రిష్ణ, ఈఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. 57 రోజులకు హుండీ కానుకలు లెక్కించగా రూ.74,02,262, విదేశీ కరెన్సీ అమెరికా డాలర్స్ 183, క్యాటర్-50 రియాన్స్ వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి నరసింహరాజు, స్టేట్ బ్యాంక్ మేనేజర్ పీ.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



నీలకంఠాపురంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం, బూదిపల్లి గ్రామాల్లో గురువారం బెంగళూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటేష్, రాష్ట్ర ప్రకృతి వ్యవసాయం ఎస్‌పీఎం జలాల్ పర్యటించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించారు. రైతులు మోహన్‌దాస్, లక్ష్మీ, మంజుల పంటలో ఏర్పాటు చేసిన (యూఆర్ఐ) యూనిట్‌ను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల విధానం, లాభాలు, పంట దిగుబడి తదితర వాటిని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలో యూఆర్ఐ ఏర్పాటు చేసుకోవడం ద్వారా తేమ శాతం తెలుస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేసి మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. భూమి ఉన్న ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం చేసి లాభాల బాట పట్టాలన్నారు. ఆ దిశగా రైతులకు అవగాహన కూడా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం కో ఆర్డినేటర్ రమేష్, డీపీఎం రంగయ్య, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

- ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రతి పోలీస్ అధికారి బాధ్యతగా పనిచేసి ముఖ్యమైన కేసుల్లో విచారణ పూర్తి చేసి పురోగతి సాధించి నిందితులకు శిక్షలు పడేవిధంగా చూడాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నెలవారి నేర సమీక్ష చేశారు. నేరాలు, శిక్షలు, కోర్టు కేసుల పురోగతిపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ కోర్టులో కేసులు వీగి పోకుండా పకడ్బందీగా కేసులను విచారించాలన్నారు. కేసులు, ఎఫ్ఐఆర్ విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. వివిధ కేసుల్లో కోర్టు ఇస్తున్న తీర్పులను ఎప్పటికప్పుడు తెలుసుకొని అవగాహనతో ముందుకు సాగాలన్నారు. ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రతి పోలీసు విధులు నిర్వర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై దృష్టి పెట్టి వాహన చోదకులను అప్రమత్తం చేస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించాలని, కొత్త వ్యక్తులు, లాడ్జీలు, హోటళ్లపై ప్రత్యేక నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్రారెడ్డి, సీఐ శ్రీహర్ష పాల్గొన్నారు.

సుఖంగా ప్రసవం!



గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పౌష్టికాహారం అందించడమే కాకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తోంది. పీహెచ్‌సీల నుంచి సీహెచ్‌సీల వరకూ అనుసంధానించి మారుమూల గ్రామాల్లోని వారికి సైతం మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టింది. దీంతో మాతృ మరణాలు గణనీయంగా తగ్గాయి.

- ఉమ్మడి జిల్లాలో తగ్గిన హైరిస్క్ గర్భిణులు
- రాయలసీమ జిల్లాల్లో అత్యంత తక్కువ
- మాతృమరణాల కట్టడికి పకడ్బందీ చర్యలు
- క్రమం తప్పని పౌష్టికాహారం, వైద్యసేవల ట్రాకింగ్‌తో ఫలితం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలు సత్ఫలితాలిస్తున్నాయి. దేశానికే ఆదర్శంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలతో ఉమ్మడి జిల్లాలో హైరిస్క్ గర్భిణుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. సుఖప్రసవాలకు మార్గం సుగమమవుతోంది. ఒక వైపు స్త్రీ శిశు సంక్షేమశాఖ గర్భిణులకు పౌష్టికాహారం అందించి రక్తహీనత నియంత్రిస్తుండగా, మరో వైపు వైద్య ఆరోగ్యశాఖ హై రిస్క్ ప్రెగ్నెన్సీ (కష్టకాన్పులకు దగ్గరగా ఉన్న గర్భిణులను) గుర్తించి, వైద్యపరంగా అన్నివిధాలా చేయూతనిస్తోంది.

క్రమం తప్పకుండా పరీక్షలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హైరిస్క్ ప్రెగ్నెన్సీలు గతంలో 20 శాతం పైనే ఉండేవి. నేడు దాదాపు 13 శాతానికే పరిమితమవుతున్నాయి. గడిచిన నాలుగేళ్లలో ఆరోగ్యశాఖ తీసుకున్న చర్యలే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

- ఫ్యామిలీ డాక్టర్ విధానం అమల్లోకి వచ్చాక గర్భిణులు, బాలింతల వివరాలు జల్లెడ పట్టి మరీ వైద్యసేవలు అందిస్తున్నారు.
- ఏఎన్‌ఎంలకు ప్రత్యేక యాప్ ద్వారా ఊరూరా గర్భిణులను గుర్తించి, వారిని క్రమం తప్పకుండా ఆస్పత్రులకు తీసుకొచ్చి యాంటీనేటల్ చెకప్ చేయిస్తున్నారు
- 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపుల ద్వారా ప్రతి గ్రామంలో వలంటీర్ల ద్వారా బాధితులను క్యాంపులకు తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- 104 వాహనాల ద్వారా ఇంటివద్దకే వైద్యులు వెళ్లి రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు నెలవారీ ఆరోగ్యవివరాలు సేకరించి చికిత్స చేస్తున్నారు.
- హైరిస్క్ ప్రెగ్నెన్సీలకు ప్రత్యేక రెఫరల్ సిస్టం ద్వారా అవసరమైతే పెద్దాసుపత్రులకు పంపించి వైద్యం చేసే ఏర్పాట్లు చేశారు.
- మారుమూల గ్రామంలో గర్భిణులు ఉన్నా సరే.. 108కు కాల్ చేయగానే 15 నిముషాల్లో అంబులెన్సు వచ్చి కాన్పుల వార్డుకు చేరుస్తోంది.



❐ ఇక్కడ మంచంపై కూర్చుని ఉన్న నిండు గర్భిణీ పేరు జి.అనిత. కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామం. సచివాలయ ఏఎన్‌ఎం వరలక్ష్మి, ఆశా వర్కర్లు ప్రతి నెలా అనిత ఇంటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. గ్రామంలో 104 వాహనం వచ్చినప్పుడు అన్ని పరీక్షలు చేస్తున్నారు. హెచ్‌బీ, బీపీ, షుగర్ నార్మల్‌గా ఉన్నాయి. ఇంటి దగ్గరకు డాక్టర్ వచ్చి చూస్తుంటే చాలా సంతోషమేస్తోందని, తనకు, బిడ్డకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నది సీఎం జగనన్నే అని అనిత ఆనందంగా తెలిపింది.

గత 10 నెలల్లో రాయలసీమ జిల్లాల్లో గణాంకాలు ఇలా..

జిల్లా	గర్భిణుల నమోదు	హైరిస్క్ ప్రెగ్నెన్సీ
కర్నూలు	32,333	5,880
నంద్యాల	19,211	3,150
వైఎస్సార్	26,642	4341
అన్నమయ్య	28,228	2,953
తిరుపతి	23,798	3,812
చిత్తూరు	20,460	3,217
అనంతపురం	27,867	3,886
శ్రీ సత్యసాయి	20,460	2,826

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు.
- ఉమ్మడి అనంతపురం హై రిస్కు గర్భిణులుగా గుర్తించిన వారిలో 99.5 శాతం మందికి రిస్కు గ్రూపునుంచి విముక్తి కల్పించారు.
- హైరిస్కు ప్రమాదం తగ్గడంతో మాతృ మరణాలు గణనీయంగా తగ్గాయి.

బిడ్డా, నేను క్షేమం

గర్భం దాల్చిన నాలుగో నెలలో రక్తహీనత ఉందని చెప్పారు. కాన్పు చాలా కష్టమవుతుందని చెప్పి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్లు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసి మందులిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి గుడ్లు, పాలు ఇచ్చారు. కాన్పు కోసం అనంతపురం సర్వజనాసుపత్రికి వెళ్లాను. సుఖ ప్రసవం చేశారు. బిడ్డకు ఇప్పుడు మూడో నెల.

– ఉలిగెం సావిత్రమ్మ, కదిరి

ఫ్యామిలీ డాక్టర్‌తో మేలు

ఫ్యామిలీ డాక్టర్ విధానం సత్ఫలితాలనిస్తోంది. గర్భిణుల సమస్యలు ప్రాథమిక దశలో గుర్తించే అవకాశం లభించింది. గ్రామ స్థాయిలోనే హైరిస్క్ ఉన్న పేషెంట్లను గుర్తిస్తున్నాం. పీహెచ్‌సీల నుంచి సీహెచ్‌సీల వరకూ అనుసంధానం చేసుకుని వారి వివరాలను అందుబాటులో ఉంచుతున్నాం. పీహెచ్‌సీలలో వైద్య పరీక్షలు నిర్వహించి ఏరియా ఆసుపత్రులు లేదా జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నాం.

– డాక్టర్ మాధవి, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, కళ్యాణదుర్గం

11 నుంచి కళా ఉత్సవ్ పోటీలు

పుట్టపర్తి: బుక్కపట్నం ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)లో ఈనెల 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్నత పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 9, 10వ తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. నాటకీకరణ, నృత్యం, మ్యూజిక్, ఫోక్ డ్యాన్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల పేర్ల నమోదుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు చొరవ చూపాలన్నారు. పోటీల్లో విజేతలు 14, 15వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు పి.లక్ష్మీనారాయణ సెల్ నంబర్: 9440944737, సురేష్‌బాబు సెల్ నంబర్ : 9440513218 సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న 'సెబ్' దాడులు



నాటుసారాను ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా సెబ్ దాడులు కొనసాగుతున్నాయి. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు తూముకుంట చెక్‌పోస్టు సోమందేపల్లి మండలంలో దాడులు నిర్వహించి 126 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అలాగే పుట్టపర్తి సెబ్‌స్టేషన్ పరిధిలో నార్పింపల్లి తండా, ఓబుళనాయనపల్లి తండా 45 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

3న విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

అనంతపురం రూరల్: నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఆదివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, మేధావులు, విద్యార్థులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

- కేంద్ర ఆర్థికశాఖామంత్రి నిర్మలా సీతారామన్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, చిత్రంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు

గోరంట్ల: దేశాన్ని 2047 నాటికి ప్రపంచపటంలో అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడానికే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' నిర్వహిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గురువారం గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో కలెక్టర్ అరుణ్‌బాబు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు రావత్, అజైయ్‌జైన్ తదితరులతో పాటు జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై' ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ సంకల్పయాత్రకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రసంగించిన సందేశాన్ని ప్రజలకు వినిపించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి అధికారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను నిర్మలా సీతారామన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళ సంఘాలకు రూ.2 కోట్ల రుణానికి సంబంధించి చెక్కును అందజేశారు. అనంతరం ఆమె పాలసముద్రం సమీపంలో నాసన్ సంస్థ వద్దకు చేరుకొని అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై నాసిన్, జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ చేతన్, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు లబ్ధి చేకూరేలా రాగి కొనుగోలు

- పౌరసరఫరాలశాఖ రాష్ట్ర కమిషనర్ అరుణ్ కుమార్



రాగి అమ్మిన రైతుకు నగదుపత్రం అందజేస్తున్న కమిషనర్ అరుణ్‌బాబు

సోమందేపల్లి: రైతులకు లబ్ధిచేకూరేలా రాగి పంటను కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ అరుణ్‌బాబు సూచించారు. గురువారం మండలంలోని గుడిపల్లిలో రాగి పంట సాగుకు సంబంధించి రైతులు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రాగిని జిల్లా వ్యాప్తంగా 900 క్వింటాళ్ల వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. మద్దతు ధర క్వింటాలుకు రూ.3,846 చెల్లించడం జరుగుతుందన్నారు. జిల్లాలో అత్యధికంగా వేరుశనగ పంటను సాగు చేసే రైతులు రాగి పంట కూడా విస్తారంగా సాగు చేసేలా వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరించే రాగి పంటకు సంబంధించి గోనె సంచులు, హమాలీలు, రవాణా ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్తీక్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ కృష్ణనాయక్, తహసీల్దార్ సురేష్, ఏడీఏ స్వయం ప్రభ, రైతులు పాల్గొన్నారు.

కురుబలకు సీఎం జగన్ ప్రాధాన్యం



కనకదాస విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్ గౌతమి, కురుబ సంఘాల ప్రతినిధులు



కనకదాస విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

- మంత్రి ఉషశ్రీ చరణ్
- 'అనంత'లో ఘనంగా రాష్ట్రస్థాయి కనకదాస జయంత్యుత్సవం

అనంతపురం టవర్‌క్లాక్: గత ప్రభుత్వం కురుబలను ఓటు బ్యాంకుగా వాడుకుంటే, జగనన్న ప్రభుత్వం వారికి రాజకీయంగా అవకాశాలు కల్పించి తగిన ప్రాధాన్యత కల్పించిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కురుబల ఆరాధ్యదైవం కనకదాస జయంత్యుత్సవాన్ని గురువారం అనంతపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గుత్తి రోడ్డులో ఉన్న కనకదాస విగ్రహానికి మంత్రి ఉషశ్రీ చరణ్‌తో పాటు కలెక్టర్ గౌతమి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కురుబల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఎంపీ, మంత్రి పదవులివ్వడమే కాకుండా పెద్ద సంఖ్యలో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, మార్కెట్ యార్డు చైర్మన్లుగా కురుబలకు అవకాశం ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రభుత్వం అధికారికంగా కనకదాస జయంతి మహోత్సవం నిర్వహించడం గర్వకారణమన్నారు. భక్త కనకదాసు కీర్తనలను కురుబ కులస్తులు తమ పిల్లలకు నేర్పించాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్ని విధాలా మంచి చేసే సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. కులాలు, పార్టీలకు అతీతంగా కుల వృత్తిలో ఉన్న కురుబలను గుర్తించి అర్హులైన వారికి ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. వీధి వ్యాపారాలు చేసుకునే కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటున్నామని, సమస్యల పరిష్కారం కోసం కురుబ కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. కుల గణన చేపట్టి బీసీల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం గురవయ్యల నృత్యం, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కురుబల ఐక్యతగా ఉండాలంటూ మంత్రి ఉషశ్రీ చరణ్ ఢమరుకం వాయించడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, రాష్ట్ర నాటక అకాడమీ మాజీ చైర్‌పర్సన్ హరిత, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, మాజీ మేయర్ రాగే పరశురాం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, విశ్రాంత జడ్జి కిష్టప్ప, రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్, జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి..

పెనుకొండ రూరల్: పట్టణంలోని మిట్ట ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గురువారం భక్త కనకదాస జయంతిని ఘనంగా ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కనకదాస విగ్రహానికి ఎమ్మెల్యే శంకరనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన పాటల ద్వారా బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నతుడు భక్తకనకదాసు అని కొనియాడారు. ప్రజలను భక్తి మార్గం వైపునకూ నడిపారన్నారు. అడుగు జాడల్లోనే ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. నగర పంచాయతీ చైర్మన్ ఫరూఖ్, వైశాలి జయశంకరరెడ్డి, కురుబ సంఘం నాయకులు కొండలరాయుడు, దుద్దే బండ మల్లికార్జున, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, ఆదినారాయణ, కౌన్సిలర్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా కందికుంట భవితవ్యం!

- నకిలీ డీడీల కేసులో కోర్టు తీర్పు రిజర్వ్
- 8న తుది తీర్పు వెలువడే అవకాశం
- ఆందోళనలో కందికుంట వర్గం



కందికుంట వెంకట ప్రసాద్

కదిరి: టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. నకిలీ డీడీల కుంభకోణం కేసులో ఇరు వర్గాల వాదోప వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ నేతృత్వంలోని న్యాయమూర్తుల బెంచ్ రెండు నెలల క్రితమే తీర్పు రిజర్వ్ చేసింది. నేడు (శుక్రవారం) లేదంటే ఈనెల 8న దాన్ని వెలువరించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అయితే జైలు శిక్ష తప్పదని భావిస్తున్న కందికుంటతో పాటు ఆయన వర్గీయులు ఆందోళన చెందుతున్నారు. అదే జరిగితే కందికుంట రాజకీయ భవితవ్యానికి ఫుల్‌స్టాప్ పడుతుందని ఆ పార్టీకే చెందిన కొందరు నేతలు చెబుతున్నారు.

ఇంతకీ కేసు ఏమిటంటే..

స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా హుస్సేనీ ఆలం (హైదరాబాద్) బ్రాంచ్‌లో 2003లో నకిలీ డీడీల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. 2007లో అప్పటి ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. కేసు దర్యాప్తు చేసిన సీబీఐ అధికారులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, నాంపల్లిలోని సీబీఐ కోర్టు అప్పట్లో కందికుంట వెంకటప్రసాద్‌కు రూ.3 లక్షల జరిమానాతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకుకు సంబంధించి రూ. 8.29 కోట్ల విలువ చేసే మరో నకిలీ డీడీల ఫోర్జరీ కుంభకోణం కేసులోనూ సీబీఐ కోర్టు కందికుంటకు రూ.13 లక్షల జరిమానాతో పాటు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. 2016 మే 31న ఈ తీర్పును వెలువరించింది. దీంతో ఈయన కొన్నాళ్లు జైలులో ఉండి తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు.

కందికుంటపై 9 కేసులు..

సాధారణంగా కోర్టులో శిక్ష పడిన వారు ఎన్నికల్లో పోటీకి అర్హులు కాదు. కందికుంట వెంకటప్రసాద్ స్వయంగా తనపై ఐపీసీ సెక్షన్ 420, 302, 307, 324, 375, 471, 147, 149 సెక్షన్ల కింద 9 కేసులున్నట్లు ఎన్నికల సంఘానికి ఇచ్చిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కోర్టులో శిక్ష పడిన వ్యక్తి ఎన్నికల్లో ఎలా పోటీ చేస్తాడని, ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈయన ప్రత్యర్థులు కొందరు అప్పటి ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి తెచ్చారు. అయితే హైకోర్టు అనుమతితోనే ఆయన పోటీ చేస్తున్నారని, అందుచేత అతని నామినేషన్‌ను తిరస్కరించేది లేదని ఆర్‌ఓ చెప్పారు. కాకపోతే ఆ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పీవీ సిద్దారెడ్డి (ప్రస్తుత ఎమ్మెల్యే) చేతిలో కందికుంట సుమారు 30 వేల ఓట్లతో ఓడిపోయిన విషయం తెలిసిందే.

ఎన్నికల్లో పోటీ చేయడని అఫిడవిట్..

శిక్ష పడిన వ్యక్తిని భవిష్యత్‌లో జరగబోయే ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని కందికుంట ప్రత్యర్థులు తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అప్పుడు కందికుంట తరఫు న్యాయవాది ఈ కేసులో తన క్లైంట్ కందికుంట ఎలాంటి తప్పు చేయలేదని, కోర్టు తుది తీర్పు వెలువరించే వరకూ కనీసం వార్డు మెంబర్‌గా కూడా పోటీ చేయడని సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చారు. ఈ క్రమంలో తుది తీర్పు రేపో,మాపో వెలువడనుందని తెలిసి కందికుంటతో పాటు ఆయన అనుచరుల్లో టెన్షన్ మొదలైంది.

కందికుంట జైలుకెళ్తే కదిరి టికెట్ ఎవరికి?..

నకిలీ డీడీల కుంభకోణంలో కందికుంటకు జైలు శిక్ష పడితే కదిరి టీడీపీ టికెట్ తనకేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలబడి గెలిచిన తర్వాత టీడీపీలోకి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా చెబుతున్నట్లు ఆయన వర్గీయులు అంటున్నారు. కందికుంట వర్గం మాత్రం కందికుంట జైలుకెళితే కదిరి టీడీపీ టికెట్ ఈసారి కందికుంట సతీమణి కందికుంట యశోదమ్మకు ఇస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

హిందూపురం టౌన్: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 23 వాహనాలకు గురువారం హిందూపురంలోని సెబ్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించారు. దీని ద్వారా రూ.2,39,500తో పాటు జీఎస్టీ నుంచి రూ.43,110ల ఆదాయం సమకూరినట్లు సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ శ్రీధర్, ఎస్ఐ జబీవుల్లా, సెబ్ సీఐ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

'వందేభారత్'పై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

అనంతపురం సిటీ: యశ్వంత్‌పూర్–కాచిగూడ మధ్య తిరిగే వందేభారత్ రైలుపై రాళ్ల దాడికి పాల్పడిన కేసులో కీలక నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అనంతపురం ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాష్ గురువారం వెల్లడించారు. బెంగళూరు నుంచి కాచిగూడకు అక్టోబర్ 17న బయలదేరిన వందేభారత్ రైలుపై అనంతపురం శివారులోని నేషనల్ పార్క్ వద్ద రెండోసారి రాళ్ల దాడి జరిగింది. ఈ క్రమంలో రైలుకు అమర్చిన సీసీ కెమెరాలకు సంబంధించిన పుటేజీలను పరిశీలించిన రైల్వే పోలీసులు అనంతపురంలోని లక్ష్మీనగర్‌కు చెందిన నీలూరు హేమంత్‌ని నిందితుడిగా నిర్ధారించి గురువారం అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

స్నాతకోత్సవ సన్నాహక కమిటీల నియామకం

అనంతపురం: జనవరిలో జరిగే జేఎన్‌టీయూ(ఏ) 13వ స్నాతకోత్సవ నిర్వహణకు సన్నాహక కమిటీలను నియమించారు. వీసీ జింకా రంగజనార్దన అధ్యక్షతన గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఈ ప్రక్రియ ముగిసింది. కార్యక్రమంలో రెక్టార్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ సి. శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, డీఏపీ ప్రొఫెసర్ వి.సుమలత, డీఏఏ ప్రొఫెసర్ సురేష్‌బాబు, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగా, జేఎన్‌టీయూ (ఏ) నూతన ఫైనాన్స్ ఆఫీసర్‌గా మహమ్మద్ సిరాజుద్దీన్ నియమితులయ్యారు. గ్రూప్–1 అధికారిని ఫైనాన్స్ ఆఫీసర్‌గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు మేరకు చర్యలు తీసుకున్నారు.

నివారణ ఒక్కటే మార్గం

- ఎయిడ్స్‌కు చికిత్స లేదు
- హెచ్ఐవీపై విస్తృత ప్రచారం
- ఏడాదిగా జిల్లాలో నమోదు కాని హెచ్ఐవీ కేసులు

శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని క్షీణింపజేసే హెచ్ఐవీ వైరస్ కారణంగా పలు వ్యాధులు సంక్రమించే అవకాశముంది. హెచ్ఐవీ ఇన్‌ఫెక్షన్ చివరి దశలో రోగ నిరోధకశక్తి పూర్తిగా క్షీణిస్తుంది. దీనినే అక్వైర్డ్ ఇమ్యూనో డెఫిషియన్సీ సింట్రోమ్ (ఎయిడ్స్) అని పిలుస్తారు.ప్రభుత్వం చేపట్టిన చర్యలు, అవగాహన కల్పిస్తున్న తీరుతో ఎయిడ్స్ మహమ్మారి క్రమక్రమంగా తగ్గింది. ఏడాది కాలంగా జిల్లాలో ఒక్కటంటే ఒక్కటి కూడా హెచ్ఐవీ కేసు నమోదు కాకపోవడమే ఇందుకు నిదర్శనం. హెచ్ఐవీకి వ్యతిరేకంగా పోరాటానికి, హెచ్ఐవీతో జీవిస్తున్నవారికి మద్దతు అందించేందుకు, ఎయిడ్స్‌తో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించేందుకు ఏటా డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఎ యిడ్స్ వ్యాధి తొలి కేసు నమోదై మూడు దశాబ్దాలు దాటినా... ఇంకా ప్రజల్లో ఈ వ్యాధిపై కొనసాగుతున్న పలు అపోహలు, సందేహాల నివృత్తికి 'సాక్షి' ప్రత్యేక కథనం.

సాక్షి, పుట్టపర్తి

హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్ (హెచ్ఐవీ) ప్రధానంగా రోగ నిరోధక వ్యవస్థపై దాడి చేస్తుంది. దీంతో అంటు రోగాలు సోకి శరీరం బలహీనమవుతుంది. రోగాలతో పోరాడే సామర్థ్యం కోల్పోయేలా చేస్తుంది. రక్షణ లేకుండా సెక్స్‌లో పాల్గొనడం, హెచ్ఐవీతో బాధపడుతున్న వారికి వాడిన సూదులు, సిరంజిలను ఇతరులకు వాడడం, హెచ్ఐవీ సోకినవారి రక్తాన్ని మరొకరికి ఎక్కించడం ద్వారా మాత్రమే వైరస్ సోకుతుంది. అలాగే, హెచ్ఐవీ ఉన్న గర్భిణుల నుంచి పిల్లలకూ సోకుతుంది. బిడ్డ కడుపులో ఉన్నప్పుడు, కాన్పు సమయంలో లేదా తల్లిపాల ద్వారా బిడ్డకు సోకవచ్చు. హెచ్ఐవీ బాధితుడితో కరచాలనం చేసినా, కలిసి భోజనం చేసినా ఆ వైరస్ వ్యాపించదు. హెచ్ఐవీ బాధితులను ముద్దు పెట్టుకుంటే వ్యాధి వ్యాప్తి చెందుతుందనడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. దోమలు కుట్టడం వల్ల ఈ వ్యాధి రాదు. హెచ్ఐవీ బారిన పడకుండా ఉండాలంటే విశృంఖల శృంగారానికి అడ్డుకట్ట వేయాల్సిందేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే హెచ్ఐవీ క్రిములు శరీరంలోకి చేరిన తర్వాత అవి విభజన చెంది వాటి సంఖ్య పెరిగి, వ్యాధి నిరోధక శక్తి ఛిన్నాభిన్నం కావడానికి కొన్ని వారాల సమయం పడుతుంది. ఆ సమయంలో వైద్య పరీక్ష చేయిస్తే హెచ్ఐవీ పాజిటివ్ అనే ఫలితం రాదు. అయితే బాధితులు మాత్రం ఈ వైరస్‌ను మరొకరికి వ్యాపింపజేసే స్థితిలో ఉంటారు.

సందర్భం : నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం



ఎయిడ్స్ అంటే ఏంటి?

హెచ్ఐవీ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత తొలిదశలో కనిపించే జ్వర లక్షణాలు తగ్గిపోయిన బాధితులు కనీసం పదేళ్ల వరకూ ఆరోగ్యంగా ఎలాంటి వ్యాధి లక్షణాలు లేకుండా జీవిస్తారు. అయితే ఆ సమయంలో హెచ్ఐవీ క్రిములు మాత్రం వ్యాధి నిరోధక వ్యవస్థను అంతర్లీనంగా నిర్వీర్యం చేస్తూనే ఉంటాయి. చివరకు అక్వైర్డ్ ఇమ్యూనో డెఫిషియన్సీ సింట్రోమ్ (ఎయిడ్స్)కు దారి తీస్తుంది. ఈ దశలో రోగ నిరోధకశక్తి పూర్తిగా క్షీణిస్తుంది. ప్రాణాంతక వ్యాధులతో పోరాడే సామర్థ్యం శరీరానికి ఉండదు. చివరకు రోగి మృత్యువాత పడతాడు. హెచ్ఐవీ సోకిన దగ్గర నుంచి ఎయిడ్స్ వ్యాధిగా మారడానికి కొన్ని సంవత్సరాలు పడుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. అయితే హెచ్ఐవీ సోకినా ప్రతి ఒక్కరిలో అది ఎయిడ్స్‌కు దారి తీస్తుందనేందుకు స్పష్టమైన ఆధారాలూ లేవు. అయితే తరచూ అంటువ్యాధులతో బాధపడుతుండడం, తీవ్ర స్థాయిలో ఇన్‌ఫెక్షన్లు సోకడం, రక్తంలో తెల్ల రక్తకణాలు (సీడీ 4) నిర్దిష్టమైన స్థాయికి మించి తగ్గితే ఎయిడ్స్ సోకినట్టు వైద్యులు నిర్ధారిస్తారు.

లక్షణాలు ఇవే..

- వైరస్ సోకిన తరువాత కొంతమందిలో జ్వరం, తలనొప్పి, శరీరంపై దద్దుర్లు, గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపించవచ్చు.
- ఈ వైరస్ క్రమంగా రోగ నిరోధక శక్తిని తగ్గిస్తుంది కాబట్టి, గొంతులో గగ్గలు దిగడం, బరువు తగ్గడం, జ్వరం, విరేచనాలు, దగ్గు లాంటి లక్షణాలు కనిపించవచ్చు.
- హెచ్ఐవీని త్వరగా గుర్తించి చికిత్స అందించకపోతే, క్షయ రోగం (టీబీ), క్రిప్టోకోకల్ మెనింజైటిస్, తీవ్ర బ్యాక్టీరియా ఇంఫెక్షన్లు, కొన్ని రకాల క్యాన్సర్లు సోకవచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి

- వివాహేతర సంబంధాలకు దూరంగా ఉండటం
- నమ్మకమైన దాంపత్య జీవితాన్ని పాటిస్తూ భాగస్వామితోనే లైంగిక సంబంధం కలిగి ఉండడం
- సరైన పద్ధతిలో కండోమ్‌ను వినియోగించడం

బాధితుల కోసం ఏఆర్‌టీ కేంద్రాలు..

హెచ్ఐవీకి చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. కానీ, వైరస్‌ను అదుపుచేస్తూ, దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించేందుకు మార్గాలు ఉన్నాయి. యాంటీరెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) ద్వారా వైరస్ లక్షణాలను తగ్గించవచ్చు. ఈ చికిత్సలో భాగంగా వైద్యులు యాంటీరెట్రోవైరల్ మందులు (ఏఆర్‌డీ) సూచిస్తారు. రోగ నిరోధక శక్తి మెరుగుపడేందుకు ఈ చికిత్స సహాయపడుతుంది. జిల్లా వ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో ఏఆర్‌టీ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

ముమ్మర ప్రచారం చేస్తున్నాం



ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా ఉండేందుకు ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. బాధితుల్లో ఆత్మస్థైర్యం పెంచుతున్నాం. ఏటా డిసెంబరు 1వ తేదీన అవగాహన ర్యాలీలు చేపట్టి హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్యాధికారి

కనకదాస జీవితం ఆదర్శప్రాయం

- డీఆర్‌ఓ కొండయ్య



మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: ఆధునిక కవి, సంగీతకారుడు ,శ్రీకృష్ణుడి పరమ భక్తుడైన కనకదాస జీవితం ఆధునిక యువతకు ఆదర్శప్రాయమని డీఆర్‌ఓ కొండయ్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమశాఖ అధికారి నిర్మలాజ్యోతితో కలిసి మాట్లాడారు. కనకదాసు కన్నడ భాషలో రచించిన కీర్తనలు బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. కనకదాస కర్ణాటక రాష్ట్రం హవేరి జిల్లాకు చెందిన బీరప్ప, బాచమ్మ దంపతులకు 1509లో జన్మించారన్నారు. అందుకే కన్నడ భాషపై మంచి పట్టు ఉండేదన్నారు. సామాన్యులకు అర్థమయ్యే విధంగా కన్నడ భాషలో రచనలు సాగిస్తూ వేదాంతాన్ని అభ్యసించి శ్రీకృష్ణుడికి భక్తుడయ్యాడన్నారు. కాలానుగుణంగా కురుబలకు ఆరాధ్యుడుగా మారారన్నారు. కనకదాస జయంతి వేడుకలకు కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెన్నప్ప, కురుబ కార్పొరేషన డైరెక్టర్ మాధవప్ప, కోటి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు, శివ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని డ్రైవర్ మృతి

- క్లీనర్‌కు తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని బళ్లారికి చెందిన ప్రసాద్, మల్లికార్జున లారీ డ్రైవర్, క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి బొగ్గు లోడుతో బళ్లారికి బయలుదేరిన వారు... గురువారం వేకువజామున గుత్తి మండలం కొజ్జేపల్లి – రజాపురం గ్రామాల మధ్య 67వ జాతీయ రహదారిపై చేరుకోగానే బొగ్గుకు కప్పిన టార్పాలిన్ జారిపోయింది. దీంతో లారీని రోడ్డు పక్కన ఆపి టార్పాలిన్‌ను సరిచేసుకుంటున్న సమయంలో గుంతకల్లు వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి ఇద్దరినీ ఢీకొంది. ఘటనలో డ్రైవర్ ప్రసాద్ (48) తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీని ఆపకుండా వెళుతుండడంతో స్థానికులు వెంబడించి గుంతకల్లు మండలం గొల్లలదొడ్డి వద్ద అడ్డుకున్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జునను 108 అంబులెన్స్ ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి హత్య

శింగనమల: మండలంలోని అనంతపురం–తాడిపత్రి ప్రధాన రోడ్డుపై శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్ద ఉన్న బస్ షెల్టరులో ఓ గుర్తు తెలియని యువకుడు (30) హత్యకు గురయ్యాడు. గురువారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి, సమాచారం అందించడంతో సీఐ అస్రార్ బాషా అక్కడకు చేరుకుని పరిశీలించారు. యువకుడి తలపై రాయితో బాది హతమార్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. రక్తం మడుగులో పడి ఉన్న యువకుడి మృతదేహం వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలించారు. అందులో దుస్తులు తప్ప ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. బస్ షెల్టర్‌కు సమీపంలో ఉన్న దుకాణాల నిర్వాహకులు, చేపల విక్రేతలను పోలీసులు విచారణ చేశారు. అయితే బుధవారం సాయంత్రం ఆ ప్రాంతంలో ఆ యువకుడు సంచరించినట్లు వెల్లడైంది. రాత్రికి బస్ షెల్టర్‌లో పడుకుని ఉన్నప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని భావించారు. కాగా, బస్ షెల్టర్ సమీపంలో ఉన్న రెండు సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలించారు. అర్ధరాత్రి బస్ షెల్టర్‌లోకి ఓ వృద్ధుడు వెళ్లినట్లుగా అందులో దృశ్యాలు నిక్షిప్తమై ఉండడంతో అతనే హతమార్చి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



యువకుడి మృతదేహం



అర్ధరాత్రి బస్ షెల్టర్‌లోకి వెళుతున్న అనుమానిత వ్యక్తి

ఎస్కేయూలో కనకదాస జయంతి



ఎంపీ గోరంట్ల మాధవ్‌ను అభినందిస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ చింతా సుధాకర్ (చిత్రంలో) రిజిస్ట్రార్ లక్ష్మయ్య, ప్రొఫెసర్ రాంగోపాల్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో శ్రీభక్త కనకదాసు జయంతిని గురువారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. సమాజంలోని మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు భక్త కనకదాసు చేసిన కృషిని కొనియాడారు. ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ చింతా సుధాకర్ మాట్లాడుతూ.. కనకదాసు జీవితం అందరికీ మార్గదర్శకమన్నారు. ఎస్కేయూలోనూ భక్త కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య మాట్లాడుతూ.. కుల వ్యవస్థపై తిరుగుబాటు చేసిన కనకదాసు జీవితం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. రచయిత బాలగొండ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.రాంగోపాల్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లిలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షిలోని బసవన్న వీధికి చెందిన ఆటో డ్రైవర్ గంగాధర్ (35)కు రెండేళ్ల క్రితం మేనమామ కుమార్తె శ్రావణితో వివాహమైంది. వీరికి ఓ కుమార్తె ఉంది. ఆరు నెలల క్రితం కర్ణాటకలోని పావగడ తాలూకా రాగికుంటకు చెందిన అనితతో గంగాధర్ వివాహేతర సంబంధం ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో రాత్రి పూట సక్రమంగా ఇంటికి చేరుకునేవాడు కాదు. విషయం తెలుసుకున్న శ్రావణి పలుమార్లు భర్తను హెచ్చరించిన ప్రయోజనం లేకపోయింది. 25 రోజుల క్రితం అనితను తీసుకుని బిసలమానేపల్లిలో అద్దె ఇంట్లో కాపురం పెట్టాడు. గత నెల 29న ఉదయం ఇంటి నుంచి వెళ్లిన గంగాధర్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. అదే రోజు రాత్రి కుటుంబసభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అంటూ వచ్చింది. గురువారం ఉదయం అనిత ఉంటున్న అద్దె ఇంట్లో గంగాధర్ మృతదేహాన్ని బిసలమానేపల్లి వాసులు గుర్తించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ శ్రావణి ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పిచ్చోడి చేతిలో కర్ర.. ధ్వంసమైన కార్ల అద్దాలు

యాడికి: మతిస్థిమితం లేని వ్యక్తి స్వైర విహారం చేయడంతో ఏకంగా ఐదు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. వివరాలను యాడికి ఎస్ఐ గురుప్రసాదరెడ్డి వెల్లడించారు. యాడికిలోని ఆస్పత్రి కాలనీలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ సోషియల్ మీడియా కన్వీనర్ ఫరూక్ ఇంటి వద్ద తన రెండు కార్లతో పాటు బాబ్జీ, శ్రీకాంత్‌కు చెందిన మరో రెండు కార్లు పార్కింగ్ చేశారు. అదే కాలనీలో నివాసముంటున్న బాలు కూడా తన ఇంటి వద్దనే కారు పార్కింగ్ చేశాడు. గురువారం తెల్లవారుజామున స్థానికుడు నారాయణస్వామి కట్టెతో అటుగా వెళుతూ కార్ల అద్దాలు ధ్వంసం చేసి, ధ్రువీకరణ పత్రాలను తీసుకెళ్లి ఇంట్లో భద్రపరుచుకున్నాడు. ఉదయం ఈ విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీసులు ఫరూక్ ఇంటి వద్దకు చేరుకుని ధ్వంసమైన కార్లను పరిశీలించారు. బాలు ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నారాయణస్వామిని గుర్తించి, అదుపులోకి తీసుకుని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నారాయణస్వామికి మతిస్థిమితం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జనవాక్కు

చేనేతల కష్టాలు తీరాయి



రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత చేనేతల కష్టాలు తీరాయి. నేతన్న నేస్తం కింద అందిస్తున్న రూ.24వేలు ఆర్థిక సాయంతో జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. గత ప్రభుత్వంలో కుటుంబ పోషణకు నానా ఇబ్బందులు పడ్డాం. నేత కార్మికులను అప్పటి టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అప్పులు తీర్చే మార్గం కానరాక చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇప్పుడా పరిస్థితి లేదు. జగన్ సర్కార్ సాయం మరువలేనిది.

– నరసింహులు, సోమందేపల్లి

కంటిచూపు బాగుపడింది



మా లాంటి నిరుపేదలు ఏదైనా జబ్బు బారిన పడితే చికిత్సకు చాలా ఇబ్బంది పడేవాళ్లం. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇంటి వద్దకే డాక్టర్లు వచ్చి చికిత్స చేస్తున్నారు. అవసరమైన మందులూ ఉచితంగా ఇస్తున్నారు. కంటి చూపు సక్రమంగా కనిపించక ఇబ్బంది పడుతున్న నేను మా ఊళ్లోనే ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో చూపించుకున్న. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు నాకు కంటి అద్దాలు ఇచ్చారు. ఇప్పుడు చూపు బాగుంది. నయాపైసా ఖర్చు లేకుండా నాకు చికిత్స అందజేసిన సీఎం వైఎస్ జగన్ మరో పది కాలాల పాటు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నా.

– పి.జి.లక్ష్మమ్మ, ఫళారం గ్రామం, గుడిబండ మండలం

సొంతింటి కల నెరవేరింది



నా భర్త, నేను వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. ఓ పాత ఇంట్లో అత్త, మామ, మరిదితోకలిసి మొత్తం 11 మంది కాపురం ఉండే వాళ్లం. సొంతిల్లు ఉంటే బాగుంటుందని గత ప్రభుత్వంలో చాలా సార్లు అర్జీలు ఇచ్చాం. అయినా ఫలితం దక్కలేదు. ఇక సొంతిల్లు ఆశ వదులుకున్నాం. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఏ ఆఫీసుకు వెళ్లకుండానే ఇంటి వద్దకే నివేసన స్థలం పట్టాను వలంటీర్ తెచ్చిచ్చాడు. గృహ నిర్మాణం మంజూరు కావడంతో ప్రస్తుతం ఇంటి పైకప్పు పనులు సాగుతున్నాయి. పేదల సొంతింటి కల నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉన్నాం.

– మోతాది సాలమ్మ, సోమయాజులపల్లి, గాండ్లపెంట మండలం

పేదరికం దూరమవుతోంది



నా భర్త శ్రీనివాసులు గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన అమ్మఒడి, దీవెన పథకాల ద్వారా మా ఇద్దరు పిల్లలు కళ్యాణి, కిశోర్ ఉచితంగా ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. మా కుమార్తె ఇంటర్ చదివేటప్పుడు రెండేళ్లు అమ్మ ఒడి, డిగ్రీ చేరాక జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా లబ్ధిచేకూరింది. మా బాబు కూడా ప్రస్తుతం బీటెక్ చేస్తున్నాడు. ఈ పథకాల ద్వారా దాదాపు రూ.90 వేల వరకూ లబ్ధి పొందాం. జగనన్న సాయమందించకపోతే పిల్లల చదువులు భారమయ్యేవి. అప్పుల పాలయ్యేవాళ్లం. జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా రూ.10 వేల చొప్పున నాలుగుసార్లు లబ్ధి పొందాను. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,750 చొప్పున మూడుసార్లు లబ్ధి చేకూరింది. నిజం చెప్పాలంటే జగనన్న పెట్టిన సంక్షేమ పథకాలతో మా పేదరికం దూరమవుతోంది.

– సి.పార్వతి, గంగానగర్, గుంతకల్లు

రైతులతో సమావేశమైన నెదర్లాండ్ బ్యాంక్ ప్రతినిధులు

మడకశిర: నెదర్లాండ్ దేశానికి చెందిన రాబో బ్యాంక్ ప్రతినిధుల బృందం గురువారం ఉదయం మడకశిర ఎంపీడీఓ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో బ్యాంక్ ప్రతినిధులు లారా, ఆండ్రిజ్, జోరియాస్, సోఫియా, ఏఎఫ్ ఎకాలజీ ఫీల్డ్ కో ఆర్డినేటర్ శంకర్, ఫీల్డ్ సూపర్‌వైజర్ రమేష్, హనుమంతు మాట్లాడుతూ.. కార్బన్ మదనం ప్రాజెక్ట్‌పై రైతులకు అవగాహన కల్పించారు. 2018 నుంచి ఇప్పటి వరకూ మామిడి, జామ, చింత, నేరేడు, సపోటా, ఉసిరి, చీనీ సాగు చేసిన రైతులు కార్బన్ మదనం ప్రాజెక్ట్‌లో చేరి లబ్ధి పొందాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ సోనీబాయి, రైతులు నరసింహమూర్తి, జంపన్న, హనుమంతరాయప్ప, రాధారమణ, నర్సేగౌడ్, సూర్యనారాయణరెడ్డి, రవికుమార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కడ్లే గౌరమ్మ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విడపనకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో కడ్లే గౌరమ్మ రథోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. గత నెల 27న ప్రారంభమైన గౌరమ్మ ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆడపడుచులు చక్కెర హారతులు పట్టి మొక్కలు తీర్చుకున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు విశేష పూలతో అలంకరించిన రథంపై కడ్లే గౌరీదేవి ప్రతిమను అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. వేల్పుమడుగు, కరకముక్కల, మాళాపురం, విడపనకల్లు, ఆర్.కొట్టాల, పెద్ద కొట్టాలపల్లి, వి.కొత్తకోట, గడేకల్లు, జనార్దనపల్లి గ్రామాల నుంచే కాక ఉరవకొండ, కూడేరు, అనంతపురం, కర్నూలు జిల్లా, కర్నాటకలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి రావడంతో విడపనకల్లు జనసంద్రమైంది. ఈ సందర్భంగా వీరగాసే, నందికోళ్ల ప్రదర్శన, కోలాటాలతో కళాకారులు అలరించారు. అనంతరం గ్రామ చివర ఉన్న పురాతన బావిలో కడ్లే గౌరమ్మను గంగ ఒడిలోకి చేర్చారు.

హావళిగిలో నేడు నిమజ్జనం..

హావళిగిలో కడ్లే గౌరమ్మదేవి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆడపడుచులు చక్కెర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం అమ్మవారి నిమజ్జనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
శుక్రవారం ॥ 1-12-2023

ఫ్యాషన్




వివాహ వేడుకలలో కట్టే చీరలే దివ్యంగా వెలిగిపోతుంటాయి.
ఇక వాటికి అదనంగా మరో స్టయిల్‌ను కూడా జోడిస్తే..
ఆ వెలుగులు రెట్టింపు అవుతాయి.
పట్టు, వెల్వెట్, ఎంబ్రాయిడరీ దుపట్టా చీర మీదకు ధరించినా,
డ్రేపింగ్‌లో జత చేసినా ఆ స్టైల్ హుందాగా కనిపిస్తుంది.
ఈ వింటర్ సీజన్‌కి ప్రత్యేకంగా ఉండటమే కాదు చలి నుంచి రక్షణను కూడా ఇస్తుంది.
ఎవర్‌గ్రీన్‌గా ఉండే శారీ కట్టుకి
మహారాణి కళను తెచ్చే దుపట్టా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుంది.

డబుల్ అట్రాక్షన్




కాంట్రాస్ట్

శారీ కలర్, దుపట్టా కలరా పూర్తి కాంట్రాస్ట్ ఉన్నది ఎంచుకోవాలి. దీనివల్ల రెండూ భిన్నంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి.





రంగు ఒకటే... డిజైన్ వేరు

సేమ్ కలర్ శారీ దుపట్టాను ఎంచుకున్నా ఎంబ్రాయిడరీ డిజైన్‌లో కాంబినేషన్స్ చూసుకోవాలి. చీర డిజైన్ హెవీగా ఉంటే, దుపట్టా డిజైన్ బ్రైట్‌గా ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. పట్టు శారీ మీదకు డిజైనర్ దుపట్టాను ఎంచుకునేటప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.

శాలువా స్టైల్

చీర మీదకు దుపట్టాను శాలువా మాదిరి కప్పుకున్నా ఈ సీజన్‌కి వెచ్చగా, బ్రైట్‌గా ఉంటుంది. అయితే, దుపట్టా గ్రాండ్‌గా ఉన్నది ఎంచుకోవాలి. ఇందుకు పట్టు, బ్రొకేడ్, ఎంబ్రాయిడరీ దుపట్టాలను చీరలను ఎంపికను బట్టి తీసుకోవాలి.

డ్రేపింగ్ దుపట్టా

చీరకట్టులో భాగంగా దుపట్టాను జత చేర్చి కట్టడం ఒక స్టైల్. ఈ కట్టును నిపుణుల ఆధ్వర్యంలో సెట్ చేయించుకోవాలి. ఈ కట్టుకు కూడా కాంట్రాస్ట్ కలర్స్ ఉండేలా చూసుకోవాలి.

* ధైర్యం

వ్యసనాల నుంచి వెలుగులోకి

పట్నాలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న రాఖీ శర్మ ఆ ఉద్యోగాన్ని వదిలేసి భర్త నడుపుతున్న రీహాబిలిటేషన్ సెంటర్‌ను తను స్వయంగా నిర్వహించడం మొదలుపెట్టింది. 5 వేల మంది ఇరవై ఏళ్ల లోపు పిల్లలను డ్రగ్స్ బారి నుంచి విముక్తి పొందేలా చేసింది. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి కౌన్సెలింగ్స్ ఇస్తోంది. మహిళలు వ్యసనానికి ఎలా లోనవుతున్నారు, వారు ఆ వ్యసనాల నుంచి బయట పడటం ఎలా అనే అంశంపై పని చేస్తున్నాను' అని వివరిస్తోంది రాఖీ. వ్యసనాలకు గురైన వారు వాటినుంచి బయటపడి తిరిగి సంతోషకరమైన జీవనాన్ని పొందేందుకు ఆమె చేస్తున్న స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం కీలక అంశాలు.

''ఒకరోజు అర్ధరాత్రి ఫోన్ కాల్ వచ్చింది. విషయం విని చాలా బాధ అనిపించింది. ఒక మహిళ బ్లేడ్‌తో ఒళ్లంతా కోసుకుంది. డ్రగ్స్ కారణంగా ఆమె వైవాహిక జీవితం దెబ్బతింది. మత్తు పదార్థాల నుంచి ఎలా బయటపడాలో ఆమెకు అర్థం కావడం లేదు. మహిళలు డీ-అడిక్షన్ సెంటర్లకు వెళ్లడం అనేది ఉందా.. అని నన్ను అడిగారు. మద్యపానం, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి అలవాటు పడిన వ్యక్తులు తమ అలవాటును వదిలించుకోవడానికి సహాయం చేయడం కూడా ఒక ముఖ్యమైన పని. నా మౌనం-పని ఈ రెండింటితో ఈ సెంటర్‌ను 22 ఏళ్లుగా నడుపుతున్నాను. వేలాదిమందిని మాదకద్రవ్య వ్యసనం బారి నుంచి బయటికి తీసుకువచ్చాను. ఒకప్పుడు తమ జీవితాలు అంధకారంలో ఉండి, అన్ని వైపులా నిరాశకు గురైన వారు ఇప్పుడు వారి కుటుంబాలతో జీవిస్తున్నందుకు సంతోషపడుతున్నాను.


రాఖీ శర్మ

బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేసి..

పుట్టి పెరిగింది గురుగ్రామ్. కొన్నాళ్లు ఢిల్లీలోనే ఉన్నాను. జంషెడ్‌పూర్, కోల్‌కతాలలో చదువుకున్నాను. డాక్టర్ కావాలనుకున్నాను కాని బ్యాంక్ ఉద్యోగి అయిన నాన్న కోరిక మేరకు సీఏ చదివాను. పెళ్లయ్యాక పట్నా వచ్చాను. నేనూ బ్యాంకు ఉద్యోగం సంపాదించుకున్నాను. కానీ కుటుంబాన్ని, ఉద్యోగాన్ని ఏకకాలంలో నిర్వహించడం అంత సులభం కాదని కొన్ని రోజుల్లోనే అర్థమయ్యింది. అప్పటికే మా వారు డీ-అడిక్షన్ సెంటర్ నడుపుతున్నారు. కొన్నిరోజులు గమనించిన తర్వాత, బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేశాను. నిజానికి డీ-అడిక్షన్ సెంటర్ ఎలా పనిచేస్తుంది, మత్తు పదార్థాల నుంచి వ్యసనపరులను ఎలా బయట పడేయాలో ఏమాత్రం తెలియదు. కానీ క్రమంగా నేర్చుకున్నాను.



వీధి బాలలు, అనాథలు, వదిలి వేయబడిన పిల్లలు ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారారు. అలాంటి పిల్లల కోసం ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించాం. వీధి బాలల కార్యక్రమాన్ని కూడా నిర్వహించాం. 30-35 మంది పిల్లలకు భోజనం, పానీయం, విద్య అన్ని ఏర్పాట్లు ఉన్న చోట ఈ కేంద్రానికి వసతి కల్పించే సామర్థ్యం కల్పించాం.

కాల్చివేస్తానని బెదిరింపులు..

బీహార్‌లో డీ-అడిక్షన్ సెంటర్ నడపడం చాలా కష్టం. మాదకద్రవ్యాల వ్యసనాన్ని వదిలించుకోవడానికి ఎక్కువగా నేర నేపథ్యం ఉన్న వారు వస్తారు. మంచి కుటుంబాలకు చెందిన పిల్లలు డ్రగ్స్‌కు బానిసలైతే పరువు పోతుందనే భయంతో వారిని బీహార్ నుంచి వేరే చోటకు పంపేవారు. ఇక ఓల్డ్‌సిటీలో డీ అడిక్షన్ సెంటర్‌కు వచ్చిన వారిని నిలువరించడం పెద్ద సవాలుగా ఉండేది. అలాంటి వాళ్లు మా కేంద్రానికి వచ్చి కొడతామంటూ ఉద్రేకంతో వస్తుంటారు. ఆ సమయంలో వారిపై వారికి అదుపు ఉండదు. వారి అలవాట్లను అడ్డుకుంటే బెదిరింపులు ఉండేవి. 'బయటకు వెళ్లాక చూడు.. నిన్ను కాల్చేస్తామ'నేవారు. కేంద్రాన్ని మూసివేస్తామని బెదిరింపులు. కానీ నేనేం తప్పు చేయట్లేదు. భయమెందుకు?

జైలులో డ్రగ్స్ నుంచి మహిళా ఖైదీల వరకు...

పట్నాలోని బ్యూర్ జైల్లో ఖైదీల కోసం 10 ఏళ్లపాటు డీ-అడిక్షన్ క్యాంప్ నడిపాను. మహిళాఖైదీలతో ఈ క్యాంప్ స్టార్ట్ అయ్యింది. జైలులో ఓ బాలిక తన బట్టలు చింపుకుని బీభత్సం సృష్టించింది. అప్పుడు నన్ను పిలిచారు. ఆమెను చూడగానే ఆ అమ్మాయి డ్రగ్ అడిక్ట్ అని అర్థమైంది. తనకు డ్రగ్స్ అందుబాటులో లేకపోవడంతో ఆమె అలా ప్రవర్తించింది. అప్పుడు ఇక్కడ ఖైదీలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో జైలు ఐజీకి నివేదించాను. ఐజీ అభ్యర్థన మేరకు జైలులో మూడు రోజులపాటు డీ-అడిక్షన్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో 1000 మందికి పైగా ఖైదీలు పాల్గొన్నారు. వందలాది మంది ఖైదీలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

నిషేధం తర్వాత..

ఒక డ్రగ్ మానేస్తే మరో మందు వాడటం మొదలుపెడతారు. బీహార్‌లో మద్య నిషేధం తర్వాత ఈ ట్రెండ్ కనిపించింది. ఇప్పుడు ప్రజలు గంజాయి, ఇతర డ్రగ్స్ ఎక్కువగా తీసుకుంటున్నారు. అయితే డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులు మద్యం కంటే వారి వ్యసనం నుండి బయటపడటం చాలా కష్టం. నిషేధం కారణంగా, ప్రజలు డీ-అడిక్షన్ సెంటర్‌లకు రావడం మానేశారు. ఆ తర్వాత జిల్లా ఆసుపత్రుల్లో డీ-అడిక్షన్ కోసం 15 ప్రత్యేక పడకలను అందించేందుకు కృషి చేశాం. ఆ తర్వాత ఈ విషయంలో వైద్యులకు శిక్షణ కూడా ఇచ్చాం. 5 వేల మంది పిల్లలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

మహిళల కోసం..

చాలా మంది మహిళలు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండానే డ్రగ్స్ అలవాటు నుంచి బయటపడేందుకు వస్తుంటారు. మహిళల కోసం ప్రత్యేక డీ-అడిక్షన్ సెంటర్ కూడా ఉంది. చాలా మంది మహిళలు తమ గుర్తింపును దాచుకుంటారు, కొందరు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇక్కడకు వస్తారు.

ఓ మహిళ భర్త దుబాయ్‌లో ఉన్నాడు. అక్కడి నుంచి ఖరీదైన మద్యం తెచ్చేవాడు. ఆమె తన బిడ్డతో ఇంట్లో ఒంటరిగా ఉంటూ మద్యం సేవించి క్రమంగా దానికి బానిసయ్యింది. పట్టించుకునేవారెవరూ లేకపోవడంతో ఆమె బిడ్డ చదువుకు దూరమయ్యాడు. దాంతో డీ-అడిక్షన్ సెంటర్‌కి వెళ్లి, కొన్ని సెషన్స్ తర్వాత నార్మల్‌గా మారింది.

అదేవిధంగా పట్నాలోని ఓ ఉన్నత కుటుంబానికి చెందిన ఓ మహిళ డ్రగ్స్‌కు బానిసైంది. ఆమె ఎంబీఏ చేసింది. తల్లి చైనాలో, సోదరుడు అమెరికాలో ఉన్నారు. ఆమె వైవాహిక జీవితం బాగోలేదు. విడాకుల తర్వాత ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. డీ-అడిక్షన్ సెంటర్‌కు వచ్చేటప్పటికి ఆమె శరీరంపై చాలా కోతలు ఉన్నాయి. బ్లేడుతో తానే కోసుకుని ఆనందించేది. కొన్నినెలల చికిత్స తర్వాత ఆమె సాధారణ స్థితికి వచ్చింది.

బీహార్‌కు చెందిన ఓ ఐఏఎస్ అధికారి మద్యానికి బానిసయ్యాడు. ఎంత ప్రయత్నించినా ఆ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నాడు. భార్య ప్రోద్బలంతో ఆ ఐఏఎస్ డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స తర్వాత తన వ్యసనాన్ని విడిచిపెట్టాడు. చాలా మంది డాక్టర్లు, ఇంజినీర్లు డీఅడిక్షన్ సెంటర్ కు వచ్చి డ్రగ్స్ అలవాటు నుండి విముక్తి పొందారు.'' అంటూ తను చేస్తున్న సేవ గురించి వివరించే రాఖీశర్మ ఎందరికో స్ఫూర్తిదాయకం.

వంటిల్లు

బఠాణితో బ్రేక్‌ఫాస్ట్...
క్యాబేజ్‌కి ఎగ్‌తో దోస్తీ... పప్పులోకి చిక్కుళ్లు.
ఊహకందని అరటికారం...
మన వంటింటి చమత్కారం

కూరలు అవే రుచులే వేరు



అరటి కాయ కారం పొడి

కావలసినవి: అరటికాయలు – మూడు; పసుపు – 1/2 టీ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; మినప్పప్పు – రెండు టీ స్పూన్లు; పచ్చిశనగ పప్పు – టీస్పూను; ధనియాలు – 2 టేబుల్ స్పూన్లు; ఎండుమిర్చి – ఐదు; మిరియాలు – టీస్పూను; ఎండు కొబ్బరి తురుము – నాలుగు టీస్పూన్లు; కరివేపాకు – ఐదు రెమ్మలు; ఇంగువ – చిటికెడు; నూనె – నాలుగు టీస్పూన్లు; ఆవాలు – అరటీస్పూను.


తయారీ: స్టవ్ వెలిగించి మీడియం మంట మీద అరటికాయలను కాల్చాలి. ● చక్కగా కాలాక మంట మీద నుంచి తీసి చల్లారాక తొక్కతీసేసి, సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు స్టవ్ మీద బాణలిపెట్టి టీస్పూను మినప్పప్పు, పచ్చి శనగపప్పు, ధనియాలు, ఎండు మిర్చి, మిరియాలు, ఎండు కొబ్బరి తురుము, మూడు రెమ్మల కరివేపాకు, ఇంగువ వేసి దోరగా వేగాక, చల్లారనిచ్చి పొడిచేసి పెట్టుకోవాలి. ●స్టవ్ మీద బాణలిపెట్టి నూనె వేయాలి. ● వేడెక్కిన తరువాత మిగిలిన మినప్పప్పు, ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి. ● చిటపటలాడాక అరటికాయ తురుము, పసుపు, రుచికి సరిపడా ఉప్పువేసి వేయించాలి. ● తరువాత మసాలా పొడి వేసి కలిపి మూతపెట్టి, సన్న మంట మీద ఐదు నిమిషాలు మగ్గనిస్తే అరటి కాయ పొడి రెడీ.



క్యాబేజ్ ఎగ్ భుర్జి

కావలసినవి: క్యాబేజీ తురుము – రెండు కప్పులు; నూనె – మూడు టేబుల్ స్పూన్లు; ఉల్లిపాయ తరుగు – అరకప్పు; అల్లం వెల్లుల్లి పేస్టు – ఒకటిన్నర టీస్పూన్లు; పచ్చిమిర్చి – చిన్నవి ఆరు(సన్నగా తరగాలి); ధనియాల పొడి – అరటీస్పూను; పసుపు – అరటీస్పూను; కారం – ముప్పావు టీస్పూను; గుడ్లు – నాలుగు; ఉప్పు – రుచికి సరిపడా; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత ఉల్లిపాయ తరుగు వేసి వేయించాలి. ● ఉల్లిపాయ వేగాక, అల్లం వెల్లుల్లి పేస్టువేసి వేయించాలి. ● అల్లం వెల్లుల్లి పేస్టు పచ్చివాసన పోయిన తరువాత పచ్చిమిర్చి తరుగు వేయాలి. ● మిర్చి వేగిన తరువాత ధనియాలపొడి, కారం, పసుపు, క్యాబేజీ తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి బాణలి మీద మూతపెట్టి సన్న మంట మీద మగ్గనివ్వాలి. ● గుడ్లసొనను ఒక గిన్నెలో వేసి బీటర్ లేదా ఫోర్క్‌తో కలిపి పక్కన పెట్టాలి. ● క్యాబేజీ ఉడికి దగ్గర పడుతున్నప్పుడు గుడ్ల సొనవేసి కలుపుతూ వేయించాలి. ● చక్కగా వేగిన తర్వాత కొత్తిమీర చల్లుకుని దించేయాలి. ● రోస్టెడ్ బ్రెడ్, చపాతీ, రోటీలోకి ఇది మంచి సైడ్ డిష్.



గ్రీన్ పీస్ ఊతప్పం

కావలసినవి: పచ్చిబఠాణి – కప్పు; సూజీ రవ్వ – కప్పు; బియ్యప్పిండి – మూడు టీస్పూన్లు; పచ్చిమిర్చి – మూడు; అల్లం – అరంగుళం ముక్క; కొత్తిమీర తరుగు – రెండు టీస్పూన్లు; జీలకర్ర – టీస్పూను; పెరుగు – అరకప్పు; వంటసోడా– 1/2 టీ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – ఊతప్పం కాల్చడానికి తగినంత.

తయారీ: మిక్సీజార్‌లో పచ్చిబఠాణి, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర, జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు వేసి తగినంత నీటిని వేస్తూ గ్రైండ్ చేయాలి. ● ఇప్పుడు ఒక పెద్ద గిన్నె తీసుకుని సూజీ రవ్వ, బియ్యప్పిండి, గ్రైండ్ చేసిన బఠాణి పేస్టు, పెరుగు కలిపి నానబెట్టాలి. ● అరగంట తరువాత రుచికి సరిపడా ఉప్పు, వంటసోడా, కొద్దిగా నీళ్లు పోసుకొని గరిట జారుడుగా కలుపుకోవాలి. ● పెనం వేడెక్కాక కొద్దిగా నూనె వేసి రెండు గరిటలు పిండి వేసి రొట్టెలా వేసుకోవాలి. దాని మీద సన్నగా తరిగిన ఉల్లిపాయ, క్యారట్, క్యాప్సికమ్ ముక్కలు వేసి మూత పెట్టి మంట తగ్గించాలి. ● ఓ నిమిషం తర్వాత మూత తీసి ఊతప్పాన్ని తిరగేసి మరో అర స్పూన్ నూనె వేసి రెండోవైపు కూడా కాల్చుకుంటే గ్రీన్‌పీస్ ఊతప్పం రెడీ. చట్నీ, సాంబార్‌తో చాలా బావుంటుంది.



చిక్కుడు కాయ పప్పు

కావలసినవి: చిక్కుడు కాయలు – పావు కేజీ; పెసరపప్పు – అరకప్పు; పసుపు – పావు టీస్పూను; పచ్చి కొబ్బరి తురుము – అరకప్పు; ఎండుమిర్చి – నాలుగు; జీలకర్ర – టీస్పూను; కరివేపాకు – నాలుగు రెమ్మలు; ఆవాలు – పావు టీస్పూను; నూనె – తగినంత; మినప్పప్పు – టీస్పూను; ఉప్పు – తగినంత.

తయారీ: పెసరపప్పుని కడిగి కుకర్ గిన్నెలో వేయాలి. ● దీనిలో కప్పునీళ్లు, పసుపు, 1/2 టీస్పూను ఉప్పు వేసి మూతపెట్టి రెండు విజిల్స్ రానివ్వాలి. ● చిక్కుడు కాయలను కడిగి ఈనె తీసి ముక్కలు చేసుకోవాలి. ● తగినన్ని నీళ్లు, చిటికెడు ఉప్పు వేసి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● పచ్చికొబ్బరి, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిర్చిని మిక్సీ జార్‌లో వేసి కొద్దిగా నీళ్లపోసి పేస్టు చేయాలి. ● ఉడికిన పెసరపప్పులో.. చిక్కుడు ముక్కలు, నూరుకున్న మసాలా పేస్టు, ఉప్పువేసి కలపాలి. ● ఒక పాత్రలో నూనె వేసి వేడెక్కిన తర్వాత ఆవాలు, మినప్పప్పు వేసి చిటపటలాడాక మిగతా కరివేపాకు వేసి వేయించి అందులో పప్పు మిశ్రమాన్ని కలిపితే చిక్కుడుకాయ పప్పు రెడీ. అన్నం, చపాతీ, రోటీల్లోకి చాలా బావుంటుంది.